హైదరాబాద్ | బుధవారం | మార్చి | 8 | 2017 సాక్షి

# మహిళల అభివృద్ధే ఎజెండా

**కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ**

జూబ్లీహిల్స్:

మహిళా అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. కేంద్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బంజారాహిల్స్ తాజ్‌కృష్ణా హోటల్‌లో ' ఎంప్లాయ్ ఉమన్ ...ఎన్‌రిచ్ ఇండియా' పేరుతో రౌండ్ టేబల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్‌డీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తుందన్నారు. సామాజిక ఉద్యమకారిణి శాంతాసిన్హా మాట్లాడుతూ..బాలికలకు ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణ లక్ష్మి స్థానంలో ' విద్యాలక్ష్మి ' పథకం ప్రవేశపెట్టి రూ.50 వేలు ఉపకారవేతనంగా అందజేయాలని సూచించారు. ఎలిప్ సంస్థ ప్రెసిడెంట్ రమాదేవి మాట్లాడుతూ దేశంలో ఎమ్ఎస్ఎంఈ రంగంలోనే ఎక్కువ ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు. తయారీ రంగానికి ప్రత్యేక రాయితీలు, హోదా ఇవ్వాలని కోరారు. డీఆర్‌డీవో శాస్త్రవేత్త శశికళ సిన్హా మాట్లాడుతూ తల్లిదండ్రులు అమ్మాయిలను ప్రోత్సహిస్తేనే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. డీఆర్‌డీఎల్‌లో 375 మంది పురుష శాస్త్రవేత్తలు ఉండగా, మహిళలు కేవలం 10మంది మాత్రమే ఉన్నారన్నారు. పారిశ్రామికవేత్త ఉమా చిగురుపాటి మాట్లాడుతూ తమ ఫార్మా సంస్థలో అన్ని విభాగాల్లో మహిళలను ప్రొత్సహిస్తున్నట్లు తెలిపారు. నాబార్డ్ మాజీ సీజీఎం వైఆర్‌కే రావు మాట్లాడుతూ గ్రామీణస్థాయిలో ఉపాధికల్పన పెంచాలన్నారు. డీఎంఈ రమణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్, ఫార్మా, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేసి మహిళలకు సీట్లు కేటాయించాలన్నారు. ఫ్యూచరిస్టిక్ సిటీస్ సంస్థ డైరెక్టర్ కరుణాగోపాల్ స్మార్ట్ సిటీస్ నిర్మాణంలో మహిళలకు ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారతకు చేపట్టాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారావు, బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, భూమ్‌రావు, నర్తకి ఆనందా శంకర్,, డాక్టర్ మంజులా అనగాని, వ్యాపారవేత్త వనితాదాట్ల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండారు దత్తాత్రేయ